# పారనిపారిక

ప్రమీలావతీదేవి

ఆగకుండా తలుపు మీద చప్పుడు అవుతుంటే విసుక్కుంటూ లేచివెళ్ళి తలుపుతీసిన దుర్గ, గుమ్మం దగ్గర నిల్చుని వున్న వ్యక్తిని చూసి అదిరి పడింది భయంకరమైన వ్యక్తిని చూసి నట్లు. అతను మాత్రం చిద్విలాసంగా నవ్వుతూ "నే నమ్మాయ్ రామనాథాన్ని నన్నప్పుడే మరచిపోయావా" అంటూనే చొరవగా లోపలికి వచ్చాడు. అతని చనువుకు మనసులోనే ఈసడించు కుంటూ ఇక విధిలేక అతన్ని కూర్చో మనక తప్పలేదు దుర్గకి.

"కూర్చోండి మామయ్యా" అని "మంచినీళ్ళు త్రాగుతారా" అడిగింది తెచ్చిపెట్టుకున్న వినయంతో


"నువ్వంత అభిమానంగా ఇస్తా నంటే ఎందుకు త్రాగనమ్మా! నిమ్మ కాయ రసం పిండి కొంత్త చక్కెర వేసి తెచ్చావంటే మరీ బాగుంటుంది" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ. మొహమాటం లేకుండా, ఆహారం పట్ల, వ్యవహారం పట్ల మొహమాటాలు పనికి రావన్నది అతని సిద్ధాంతం. దుర్గ లోపలికెళ్ళి మంచినీళ్ళు తెచ్చేలోగా అతను ఆ గది లోని వస్తువులను, ప్రక్క గదిలోని వస్తువులను పరిశీలనగా ఆమె చూసి అంతస్థుని, హోదాని మనసులోనే అంచనా వేసుకోసాగాడు.

దుర్గ ఐస్‌వాటర్‌లో నిమ్మ షర్‌బత్ కలిపి తెచ్చి ఇచ్చింది. ఆమె చేతిలో గ్లాసు అందుకుని ఒక్కో గుటక వేస్తూ మధ్య మధ్య "జీతం ఎంతేమిటి? చాలా సామాన్లు సంపాదించావే, నీ కన్నా మీ ఆయన జీతం ఎక్కువేనట కదా, చాల పలుకుబడి వుందట అతగాడికి" అంటూ గ్లాసు ఖాళీచేసాడు. గొంతు చల్లబడినా అతని అంతరంగం మాత్రం అసూయతో ద్వేషంతో భగ్గుమని మండు తున్నది. 'ఆడదేమిటి, స్వయం శక్తి తోనూ, తెలివితేటలతోనూ ఇంత వృద్ధిలోకి రావడమేమిటి' అనే భావంతో.

తనకూ ఇద్దరు కూతుళ్ళున్నారు, వాళ్ళు వృద్ధిలోకి రావాలని, పేరు ప్రతిష్ఠ తెచ్చుకోవాలని, వాళ్ళని కోరి

చదివించాడు కాని వాళ్ళవి అంతంత మాత్రం చదువులే అయ్యాయి. కాని తన పంచనచేరి, తన భార్య విదిలించిన ఎంగిలి మెతుకులు తింటూ, ఆ పని ఈ పని చేస్తూ కుసికిపాట్లు పడుతూ చదువుకున్న ఈ దుర్గ ప్రతిక్లాసు తప్పకుండా ఫస్టుమార్కులతో పాసవుతూ వచ్చింది. 'దాని మొహం దానికీ ఓ చదువేనా?' ఆ పాటి చదువుకి దానికి ఉద్యోగం వస్తుందా? పెళ్ళవుతుందా? లక్షలకట్నాలు గుమ్మరించినా ఓ ఆడపిల్ల పెళ్ళవడమే కష్టంగావున్న ఈ రోజుల్లో ఈ పిల్లకు పెళ్ళవుతుందా? భార్య పోయినవాడెవడో తన పిల్లలకి ఆయాగా చేరదీయకపోడులే అనుకున్నాడు 'దుర్గ' గురించి అప్పట్లో. కాని ఆ పిల్ల అదృష్టం గురించి తనకేం తెలుసు? అందుకే తప్పు అంచనా వేసుకున్నాడు కాని తను ఈసడించుకున్న పిల్లే పరీక్షలు పాసయ్యింది. టైపు నేర్చుకుంది. ఉద్యోగం సంపాదించుకుంది. కాణీ కట్నం ఇవ్వకుండా పెళ్ళి చేసుకుంది. గొప్పవాళ్ళు సమకూర్చుకున్నట్లు టి.వి, గాడ్రేజ్ బీరువా, ఫ్రిజ్, సోఫా సెట్టు డ్రెస్సింగ్ టేబిల్ వగైరా వస్తువులను సంపాదించుకుంది ఆడదంటే తన ఎదురుగావున్న ఈ దుర్గేను' లోలోపలే ఆలోచిస్తూ ఉక్రోషంతో ఆవేశపడుతున్నాడతను.

"కూర్చుని ఈ పేపరు తిరగేస్తుండండి మామయ్యా" అని చేతిలోని



గ్లాస్ లోపల పెట్టిరావడానికి వెళ్ళింది దుర్గ. అతనికి ఆలోచించుకోవడానికి మరికాస్త అవకాశం ఇస్తూ.

చదువూ, అందంవున్న తన కూతుళ్ళకు బోలెడంత కట్నం ఇస్తేనే గాని పెళ్ళిళ్ళు కాలేదు అంత డబ్బుపోసి అల్లుళ్ళను కొన్నా తన కూతుళ్ళు సుఖపడుతున్నారా అంటే అదీలేదు. పెద్దల్లుడు అహంకారి, జూదరి, వ్యభిచారీను. గొప్పలకి పోతూ భార్యని నలుగురిలో అవమానిస్తుంటాడు రెండో అల్లుడు, ముక్కోపి. ఆడవాళ్ళని హీనంగా చూసే స్వభావం అతనిది. ముఖ్యంగా భార్య అతని దృష్టిలో బానిస, దాసి. తనమాట జవదాటకూడదు. తను నిల్చో అంటే నిల్చోవాలి, కూర్చోఅంటే కూర్చోవాలి. తన కెదురుచెప్పిందా అంతే ఆ రోజు భార్య రక్తం కళ్ళ జూడాల్సిందే. అటువంటి భర్త చేతిలో ఏ భార్య సుఖపడ

గలదు? ఆనందం అనుభవించ గలదు? తన పిల్లల దురదృష్టమది' అనుకుని బాధపడుతూ వుంటాడు తను.

కాని తన దయాదాక్షిణ్యాలతో పెరిగిన దుర్గ అదృష్టం ఈ రకంగా వుంటుందని తను కలలో కూడా వూహించుకోలేదు రామనాధం. తను వూహించినట్లుగానే ఏ రెండో పెళ్ళి వాడినో పెళ్ళిచేసుకుని అతనిముందుభార్య పిల్లలకు చాకిరీచేస్తూ చాలీచాలని జీతంతో వస్తులతో, చింకిచాప లాంటి జీవితంతో దుర్గ కుస్తీ పడుతుంటే అతనికి చాల సంతోషంగా, సంతృప్తిగావుండేది కాని తను చూసేది తన వూహలకి విరుద్ధంగావుంది. అందుకే అతనికి బాధగాను, అసూయగానూ వుంది.

అతని చూపులు పేపరు మీద వున్నా ఒక్క అక్షరంకూడా అతను చదవలేదు తను వచ్చినపని ఏ రకంగా సానుకూల పర్చుకోవాల అని ఆలోచిస్తున్నాడు. అప్పుడే దుర్గ వచ్చి అతని ఎదురుగా మరో సోఫాలో కూర్చుని "అంతా బాగున్నారా మామయ్యా" అంది.

"అ ఏం బాగులే" అన్నాడు రామనాదం. చేతిలోని పేపరు మడిచి ప్రక్కన పడేస్తూ,

"విజ్జి, రాజి ఎక్కడ వున్నారు, వాళ్ళకి పిల్లలా? చలపతి ఏం చేస్తున్నాడు? అతనికి పెళ్ళి చేసావా?" దుర్గ ఆప్యాయతగా అడగసాగింది ఒక్కొక్కరి గురించి.

"అందరూ బాగానేవున్నారు. చలపతికి పెళ్ళిచేసాను. వాడి పెళ్ళికి నీకు ఇన్విటేషన్ పంపించాలని చూసానుకాని నీ అడ్రస్ తెలుస్తేకదా? వాడికి ఓ కూతురు కూడాను అసలు నేను వచ్చింది వాడి గురించేను" అతనుసగంలో మాటఆపి చుట్టూ చూశాడు తన మాటల్ని మరెవరైనావినడం లేదుకదా అనేసందేహంతో. దుర్గ తలెత్తి అతనివైపు చూసింది ఏమిటా విషయం అన్నట్లుగా.

"అవునూ నువ్వు ఆఫీసుకి వెళ్ళలేదేం. అసలు నువ్వుంటావో వుండవో అని భయపడుతూ వచ్చాననుకో;

"నేను ఆఫీసుకి వెళ్ళడంలేదు మామయ్యా" నవ్వింది దుర్గ.

"అదేం?"

"ఉద్యోగం మానేసాను. ఆయన జీతమే మాకు సరిపోతుంది ఇక నేను ఉద్యోగం చేయడం ఎందుకులే అని మానేసాను"

"మంచి పని చేసావు ఇంతకీ మీ ఆయన ఎప్పుడు వస్తాడు?"

"వచ్చే వైమయ్యింది. ఇంతకీ చలపతి ఏం చేస్తాడు?" అడిగిందామె.

"కాస్త కక్కుర్తిపడ్డాడటఆ విషయం పై అధికారికి తెలిసిందట వెంటనే సస్పెండు చేసారు. మీ ఆయన, ఆ

అధికారి మంచి స్నేహితులని, మీ ఆయనచెప్తే చలపతిని గట్టుమీద పడేస్తారని తెలిసి నీ అడ్రస్ తెలుసుకుని వెతుక్కుంటూ వచ్చాను. ఎంతయినా మనం కావాల్సినవాళ్ళం కదా ఈమాత్రం సహాయం మీ ఆయన చేయకపోతాడా అని వచ్చాను" అసలు విషయం బైట పెట్టి ఆమె వైపు ఆశగా చూసేడు రామనాధం.

అతని మాటలు వింటూనే వులిక్కిపడింది దుర్గ. తన భర్తకు పెద్దవాళ్ళతో పరిచయం వుందని తనకితెలుసు. నీతికి, నిజాయితీకి, ధర్మానికి అన్యాయం జరుగుతున్నదంటే ఊరుకోడు, సహించలేడు. అటువంటివారికోసం ప్రాణాలొడ్డయినా పోరాడి వాళ్ళకి న్యాయం జరిగేలా చూస్తాడు. కాని అదే అన్యాయం, అధర్మం, అవినీతికి సంబంధించిందని తెలిస్తే వాళ్ళెత్తు ధనం ఇచ్చినా వాళ్ళకి సహాయం చేయడు సరికదా అటువంటివారిని గుమ్మందిగి మాట్లాడమంటాడు. చలపతి కక్కుర్తిపడ్డాడంటే అది తప్పకుండా లంచం వ్యవహారమే అయ్యుంటుంది అటువంటివారికి సహాయం చేయడానికి ససేమిరా వప్పుకోడు. "లంచగొండులను, అవినీతిపరులను, అధర్మానికి పాలుపడేవాళ్ళకు సహాయంచేస్తే వాళ్ళని మనం మరింత ప్రోత్సహించినవాళ్ళం అవుతాము, అటువంటి ప్రోత్సాహం మాత్రం నా నుండి లభించదు అని నిష్కర్షగా చెప్పేస్తాడు. అటువంటప్పుడు రామనాధానికి సహాయం చేస్తాడన్నది కలలోవార్త. ఆ విషయం ఇతనికిచెప్తే ఏమనుకుంటాడో దుర్గ భర్త స్వభావం గురించి పైకి చెప్పలేక మదనపడసాగింది.

దుర్గ మొహంలో తారట్లాడే భావాలను అర్థంచేసుకోలేనంత మూర్ఖుడు కాదు రామనాధం. ఎటువంటి వాడైనా భార్య చెప్పిన మాటను 'కాదు' 'చేయను' అనలేడు కదా, ఓ వేళ అతనికి ఇష్టంలేకపోయినా భార్య చెప్తే కాదనలేడు కదా అన్నదే అతని ధీమా.

మీ ఆయన ముక్కుకి సూటిగా పోయే స్వభావం కలవాడని విన్నాననుకో కాని నువ్వు చెప్తే వినకపోడు. ఆ నమ్మకంతోనే నిన్ను వెతుక్కుంటూ వచ్చాను. చలపాయ్‌ని నీట ముంచుతావో, పాల ముంచుతావో నీదే భారం" చివరి మాట వత్తి పలికాడు రామనాధం.

"ఇటువంటి విషయాలల్లో ఒకరి మాట వినరు మామయ్యా. తనకి న్యాయం ధర్మం అనుకున్నది తప్పకుండా చేస్తారు" దుర్గ చేతివేళ్ళను చూసుకుంటూ జవాబిచ్చింది.

"ప్రతి మగవాడు పైకి అలాగే కనిపిస్తాడు. చివరకు భార్య చేతిలో కీలుబొమ్మ అవుతాడు. అవునూ నీకు సూర్యం గుర్తున్నాడా? వుండే వుంటాడులే. వాడీమధ్య ఏమని ప్రచారం చేస్తు

న్నాడో నీకు తెలుసా? నీ కెలా తెలుస్తుందిలే." సడన్‌గా సంభాషణా ధోరణి మార్చేడు రామనాథం.


"ఏమని ప్రచారం చేస్తున్నాడేంవిటి?" కుతూహలంగా అడిగింది దుర్గ. ఆ అడగడంలో ఎటువంటి తొట్రుపాటు వ్యక్తం కాలేదు.

"తనకు ఉద్యోగం నీ వల్లే వచ్చిందట, నువ్వు తనతో పూర్వపు అభిమానంతో మాట్లాడుతున్నావని, ఇంకా ఏదో ఏదో నోటికొచ్చిన అవాకులు చవాకులు వాగుతున్నాడులేమ్మా, అవన్నీ నీ మొగుడికి తెలిసాయంటే నీ కాపురమే కూలిపోతుంది" అలా చెప్తూనే దుర్గ మొహంలోకి చూడసాగేడు, తన మాటలు ఏ మాత్రమైనా ప్రభావం చూపెట్టాయా లేదా అనుకుంటూ. కాని ఎదురుచూస్తున్నట్లుగా ఆమె మొహం భయంతో పాలిపోవడంగానీ, కంగారుపడటంగాని కనిపించలేదు.

"ఉద్యోగం నేను ఇప్పించడమేమిటి? అతని అదృష్టమే అతనికిప్పించింది. అతన్ని ఇంటర్వ్యూ చేసిన వారిలో మా వారు కూడా ఉన్నారు. 'మీ ఊరి అతనే. చాలా తెలివిగా, చురుగ్గా సమాధానం చెప్పేడు. అతనికి ఈ ఉద్యోగం రావచ్చు' అన్నారు ఆ రోజు. అలాగే వచ్చింది కాబోలు" తాపీగా అంది దుర్గ.

"వాడెంత దుర్మార్గుడో నీకేం తెలుసు 'ఆయన భార్యా, నేనూ ప్రేమించుకున్నాము. విధి వక్రించి పెళ్ళి చేసుకోలేకపోయాము. పెళ్ళి చేసుకోకపోతేనేం మళ్ళీ మా మధ్య పాత స్నేహం సాగుతూనే వున్నది' అని అందరిదగ్గర చెప్పుకుంటున్నాడట. ఈ మాటలు మీ ఆయన వింటే నీ కాపురం ఏమైపోతుందో నువ్వే చెప్పమ్మాడు?"

"నువ్వు పొరబాటుగా విని వుంటావు మామయ్యా! సూర్యం అటువంటివాడు కాడు. చదువుకునేరోజుల్లో పెళ్ళి చేసుకోవాలనుకున్నాము. 'కాణీ కట్నం ఇచ్చేవాడిని కాదు. కావలిస్తే ఎవడితో అయినా లేచిపో అంతేగాని పెళ్ళిమాత్రం చేయను' అని నువ్వు ఖండితంగా చెప్పేసావు. 'కట్నంలేని పెళ్ళి నీకు చేయనుగాక చేయను. నేను చూసిన పిల్లని చేసుకుంటేనే నా ఆస్తిలో వాటా దక్కుతుంది. నీ యిష్టంవచ్చిన పిల్లని చేసుకుంటే ఆ రోజే నీవు ఇంట్లోంచి బైటకు పోవాల్సిందే' అని అతని తండ్రి ఆంక్ష విధించేసరికి మా పెళ్ళిమీద ఆశ విడిచిపెట్టేసాము. స్నేహితుల్లా విడిపోయాము. అటువంటి సూర్యం అలా ప్రచారం చేస్తున్నాడంటే నేను నమ్మలేను. పనీ పాటలేని సోమరివెధవ లెవరో నీ కలా చెప్పివుంటారు. అదే నిజమని నమ్మి, నా క్షేమం కోరి నాతో చెప్పటానికి వచ్చి వుంటావు" దుర్గ అంటున్న మాటలు వింటున్న రామనాథం ముఖం వివర్ణమయ్యింది గొంతుకేదో అడ్డు



పడ్డట్లు లోలోపలే గింజుకున్నాడు చాలా సేపు. తన ప్లాను ఫలిస్తే దుర్గ పల్లతను వచ్చినపని అవుతుందని అనుకున్నాడు. అందుకే నోటికొచ్చినదంతా వాగేడు కాని ఈ పిల్ల చాలా.తెలివిగలది. తననే చవట కింద జమచేసి మాట్లాడేసింది.

"పోనీలెమ్మా, ఈ మాటలు మీ ఆయనకు తెలియనివ్వకు. నీ కాపురానికే వస్తాయి చిక్కులు" అన్నాడు చివరి ఆయుధంగా.

"నా కా పు రా ని కే ఆపదా లేదు మామయ్యా. పనీపాటాలేని సోమరి వెధవలు చేసే గాసిప్‌ని ఆయనసలు నమ్మరు. ఆ విషయంలో నువ్వు నిశ్చింతగా వుండవచ్చు" ఆత్మ విశ్వాసంతో దృఢంగా అంది దుర్గ.

"ఏ(విటి దుర్గా, గాసిప్ అంటున్నావు ఎవరి గురించే(విటి" అప్పుడే లోపలికి వచ్చిన స్ఫురద్రూపి అయిన చక్కని యువకుడు నవ్వుతూ దుర్గని అడిగి, ఆ తరువాత చూసేడు రామనాధాన్ని. 'ఎవరు?' అన్నట్లు కళ్ళతోనే అడిగేడు

భార్యని.

"ఆయన మా యయ్య అవుతారండీ. పేరు రామనాథంగారు" వివరంగా చెప్పింది దుర్గ.

"ఓ! అలాగా! నమస్కారమండీ మిమ్మల్ని కలుసుకోవడం నా అదృష్టం" అతను నాటక ఫక్కీలో అంటూ చేతులు జోడించాడు, భర్త పద్ధతికి నవ్వుకుంటూ లేచి ఇంట్లోకి వెళ్ళిపోయింది దుర్గ.

"మా ఊళ్ళో సూర్యం అనే ఓ వ్యక్తి వున్నాడు. అతను అమ్మాయి గురించి ఏదో వాగుతున్నాడు. ఆ విషయం అమ్మాయితో చెప్తున్నాను. 'జాగ్రత్త అమ్మాయి" అని, అంతవరకూ చెప్పి అతనివైపు చూసేడు రామనాథం పొగ రాజడానికి ఆ మాత్రం నిప్పు చాలుకదా అనే దురుద్దేశంతో.

"ఓ అతని గురించా మీరు చెప్పేది? దుర్గ ఆ విషయం మా పెళ్ళికి ముందే నాతో చెప్పింది సార్, ఆమెలోని ఆ నిజాయితే నాకు నచ్చి మమ్మల్ని ఓ యింటివాళ్ళను చేసింది. తెలిసీ తెలియని వయసులో, ఆవేశంలో అనేకం అనుకుంటాము; కాని అవన్నీ జరగవు కదా, చదువుకునే రోజుల్లో నేను చాలామంది అమ్మాయిలతో స్నేహం చేశాను. మరెంతమందికో ప్రేమలేఖలు రాసేను, ప్రేమిస్తున్నాను అంటూ. కాని అవన్నీ నిజమైతే చాలామందిని పెళ్ళిచేసుకోవాల్సి వచ్చేది, కాని అలా జరిగిందా? అదంతా వయసు ఉద్రేకం సార్, ఎవరెలా చెప్పుకున్నా మాకు భయంలేదని అతనితో చెప్పండి, పెద్దవారు మామీద అభిమానంతో శ్రమపడి ఇంతదూరం వచ్చి మరీ చెప్తున్నారు! మీరా శ్రమపడవద్దని వినయపూర్వకంగా మనవి చేస్తున్నాను, మరి వెళ్ళిరండి" అతను మరోసారి చేతులు జోడించి లోపలికి వెళ్ళిపోయాడు. ఆ గదిలో పంటరిగా మిగిలిపోయిన రామనాథం ముఖం మాడిపోయిన పెసరట్టులాగే అయ్యింది. తను ఒకందుకొస్తే మరొకటయ్యింది అనుకుంటూ సిగ్గూ, అవమానాలతో ఆ ఇంటి గుమ్మం దాటేడు.